క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ నేత ఉమామహేశ్వరరావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత

ద్వారకాతిరుమల: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పొనమాల ఉమామహేశ్వరరావును రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం పరామర్శించారు. ఆయన తల్లి మృతి చెంది ఏడాది పూర్తి కావడంతో వాటికి సంబంధించిన కార్యక్రమాలను ఇటీవల నిర్వహించారు. వాటిలో వనిత పాల్గొనలేకపోయారు. దీన్ని పురస్కరించుకుని ఆమె ఉదయం ఉమామహేశ్వరరావు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, అచ్యుత ఏసు బాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చిలుకూరి చంద్రం, రుద్ర శివ, చెన్నూరి రామకృష్ణ, భోగరాజు సాయికృష్ణ, షేక్ మస్తాన్ భాషా, మల్లెపూడి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు విశేష పూజలు



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. కళ్యాణ వేదిక వద్ద ఉత్సవమూర్తికి అభిషేకాలు, మూలవిరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, చతుర్వేదస్వస్తి, వేదదర్బారు సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజన సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో 72వ చండీహోమం నిర్వమిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం పైల రమణ, రాజ్యలక్ష్మీ దంపతులు ఐదు తులాల వెండిని సమర్పించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

కొయ్యలగూడెం: లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. టెంపుల్స్ సెంటర్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో కొలువైన స్వామి వారికి అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్త దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

పోషణ వాటికను సద్వినియోగం చేసుకోవాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న సీడీపీవో

జంగారెడ్డిగూడెం: లబ్ధిదారులు పోషణ వాటికను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా అన్నారు. మండలంలోని తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సాక్ష్యం 2.0 పోషణ వాటికను శుక్రవారం ఆమె సందర్శించారు. గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ వాటిక ద్వారా ఎటువంటి రసాయన, క్రిమి సంహారకాలు వాడకుండా ఆకుకూరలు, పాదు మొక్కలు పెంచుతున్నామన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆకుకూరల మెక్కలు పంపిణీ చేశారు. ప్రీ స్కూల్ పిల్లలకు సాక్షం అంగన్‌వాడీలో భాగంగా మూన్ డస్కులు, కుర్చీలు, వాటర్ ఫిల్టర్లు, జారుడుబల్లలు అందజేశారు. సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి, జీఎంఎస్‌కే, అంగన్‌వాడీ టీచర్స్ మేరీ ఫాతిమా, అనూష, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీదారు అరెస్ట్

చింతలపూడి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఫాతిమాపురం అడ్డ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన వాహన సోదాల్లో ద్విచక్ర వాహనంపై నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూక్య గోపి తన ద్విచక్ర వాహనంపై పది లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారు చేసినా విక్రయించినా నేరమని తెలిపారు. గీత కులాల మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఎనిమిదో తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

గిరిజనుల సిరుల పంట

- ఏడాది పొడవునా వాడుకుంటున్న గిరిజనులు
- సంప్రదాయ పద్ధతిలో సాగు చేస్తున్న కొండరెడ్లు
- అధికారులు ప్రోత్సహించాలని కోరుతున్న గిరిజనులు



మండలంలోని గోగుమిల్లిలో గిరిజనులు వేసిన జొన్న పంట

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో కొండరెడ్డి గిరిజనులు పండిస్తున్న చిరుధాన్యాల పంటలకు మంచి గిరాకీ ఉంటుంది. అటవీ ప్రాంతంలోని గ్రామాల సమీపంలో కొండలు, గుట్టలను తొలగించి పోడు వ్యవసాయ పద్ధతిలో గిరిజనులు జొన్నలు, సామలు, సజ్జలు, రాగి, కందులు, బొబ్బర్లు, మినుము వంటి పంటలను పండిస్తుంటారు. అయితే ఈ పంటలను విక్రయించడానికి మాత్రం కాదు. కేవలం వారి కుటుంబ సభ్యులు ఏడాది పొడవునా తినేందుకు మాత్రమే ఈ పంటలను పండిస్తూ ఉంటారు. ఎక్కువ పంట పండించిన గిరిజనులు బాగా తెలిసిన వారికి మానికల కొలతలతో విక్రయిస్తూ ఉంటారు. అయితే ఇవి పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండించడంతో ఎంతో రుచిగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటారు.

500 ఎకరాల్లో చిరుధాన్యాల పంట

ఏజెన్సీలో కొండ ప్రాంతాల్లో ఉండే కొండరెడ్లు ప్రతి ఏటా జొన్నలు, కొర్రలు, సజ్జలు, సామలు, రాగి, కందులు, బొబ్బర్లు వంటి పంటలను సాంప్రదాయ పద్ధతిలో సాగు చేస్తూ ఉంటారు. ప్రతి ఏటా 500 ఎకరాల్లో గిరిజన రైతులు పంటలు పండిస్తున్నారు. చింతకొండ, గొట్టాలరేవు, రేగుల పాడు, రేపల్లె, ఒర్రింక, కల్లుమామిడి, గడ్డపల్లి, గిన్నెపల్లి, ఉప్పరిల్ల, గోగుమిల్లి, తదితర గ్రామాల్లో ప్రతి రైతూ ఒక ఎకరం నుంచి రెండు ఎకరాల వరకూ ఈ పంటలను పండిస్తున్నారు.

పంటల రక్షణకు ప్రత్యేక చర్యలు : అటవీ ప్రాంతంలో పోడు భూమిలో చిరుధాన్యాలు పండిస్తున్న కొండరెడ్డి గిరిజనులు ఆ పంటలను రక్షించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. అడవి జంతువులు, పక్షులు, ఎలుకలు, ఎక్కువగా పంటలను పాడు చేస్తుంటాయి. అయితే జొన్నపంటను పక్షుల నుంచి రక్షించుకునేందుకు మంచెను ఏర్పాటు చేసి దానిపై నిలబడి శబ్దం చేస్తూ ఒక తాడుకు రాయికట్టి చుట్టూ తిప్పుతూ విసురుతూ ఉంటారు. అలాగే అడవి జంతువులు రాకుండా డబ్బాలను మోగిస్తూ శబ్దం చేస్తూ తరిమేస్తుంటారు.

రెండెకరాల్లో జొన్న పంట



నేను ప్రతి ఏటా రెండు ఎకరాల్లో జొన్నపంట పండిస్తాం. అది కేవలం నేను నా కుటుంబ సభ్యులు ఏడాది పాటు తినడానికి మాత్రమే. వీటితో పాటు కందులు, సామలు, చోళ్ల పంట కూడా పండిస్తున్నా. కొండ ప్రాంతం ఈ పంటలకు అనువుగా ఉండడంతో మా పూర్వీకుల నుంచి సాంప్రదాయ పంటగా పండిస్తున్నాం.

– గురుగుంట్ల చిన్నారెడ్డి, జొన్న రైతు, చింతకొండ

గిరిజనుల సంప్రదాయం..



చిరుధాన్యాల పంటలను గిరిజనులమైన మేము పండిస్తున్నాం. జొన్న, కంది, కొర్రలు, చోళ్లు, సామలు వంటి పంటలను పండిస్తున్నాం. మేము బయట సంతలకు వెళ్లిన సమయంలో ఆ విత్తనాలను తీసుకొచ్చి పంటలు వేస్తాం. అలాగే మేము పండించిన పంటల్లో కొంత విత్తనాలకు ఉంచుకుంటాం. ఇది మా పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయం. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పంటలు వేశాం. అధికారులు మరింత ప్రోత్సహిస్తే ఎక్కువ పంటలు పండిస్తాం.

– గురుగుంట్ల ప్రసాదరావు, కొండరెడ్డి గిరిజనుడు, చింతకొండ

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు పరామర్శ



మాజీ ఎమ్మెల్యే బాలరాజు, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయ కర్త కారుమూరి సునీల్ కుమార్ శుక్రవారం మండలంలోని దుద్దుకూరులో పరామర్శించారు. ఈ సందర్భంగా బాలరాజు తల్లి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కొయ్యలగూడెం ఎంపీపీ గంజిమాల రామరావు, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే బాజీ, తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న జ్యుడీషియల్ మేజిస్ట్రేట్

జంగారెడ్డిగూడెం: దేశ వ్యాప్తంగా 1976 నుంచి వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలించబడిందని, ఎవరైనా హక్కులు హరించే విధంగా ఎవరినైనా పనుల్లో పెట్టుకుని పని చేయించుకుంటే చట్ట ప్రకారం శిక్షకు గురఅవుతారని జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.రాజేశ్వరి తేస్వీని తెలిపారు. ఈ నెల 9వ తేదీన జాతీయ వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు వెట్టి చాకిరీ నిషేద చట్టంపై అవగాహన కల్పించారు. నూతనంగా నియమితులైన పారా లీగల్ వలంటీర్లకు న్యాయవాదులు విధి విధానాలు వివరించారు. కార్యక్రమానికి న్యాయవాది అచ్యుత శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, న్యాయవాదులు బల్లే సాయికుమారి, తోట పద్మిని, తంబళ్ల రాము, జి.గాయత్రీ, గెద్దా గౌతమి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



సచివాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

కొయ్యలగూడెం: నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి కుంచె వసంతరావు భుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో రాజవరంలో గ్రామ సచివాలయం వద్ద మండల వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకోవడానికి కాలనీలు మంజూరు చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఇల్లు మంజూరు చేసి, పట్టాలు పంపిణీ చేశారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రేలా నరసింహారావు, వాగు వెంకటరత్నం, నేరుసు బుక్కయ్య, నిమ్మల గంగరాజు, దుర్గయ్య, యర్రావుల గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామకోటి మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని రామకోటి 93వ వార్షిక మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్టు రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ తెలిపారు. స్థానిక పేరయ్యకోనేరు ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలు మార్చి 2వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు



అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న రేంజ్ అధికారి

బుట్టాయగూడెం: వేసవి కాలంలో అడవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కన్నాపురం రేంజ్ అధికారి ఏ.శివరామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి ముంజులూరు, ఒర్రింక, కొత్తుపల్లి బీట్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నాపురం రేంజ్ పరిధిలో సుమారు 18 వేల హెక్టార్లలో అడవి విస్తరించి ఉందన్నారు. అయితే వేసవిలో అటవీ ప్రాంతంలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అదే విధంగా ఇటీవల అక్రమ కలప రవాణాపై కఠిన చర్యలు చేపట్టిన నేపథ్యంలో కొందరు రైతులు ములగల కర్ర కోసం అర్జీ పెట్టుకున్నారని తెలిపారు. అయితే విషయాన్ని డీఎఫ్ఓ శ్రీశుభం దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. అయితే కత్రుపల్లి బీట్ పరిధిలో 312 హెక్టార్లలో వెదురు విస్తరించి ఉందని చెప్పారు. ఒర్రింక, కల్లుమామిడి, చింతపల్లి, తదితర ప్రాంతాల పరిధిలో ఎక్కువ వెదురు కూపులు ఉన్నాయన్నారు. అక్రమ కలప రవాణా జరగకుండా అన్ని వైపుల నుంచి గట్టి నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ప్రభాకరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్



విద్యార్థులకు సూచనలు అందజేస్తున్న ఎంఈఓ

లింగపాలెం: ప్రతి విద్యార్థి తన భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకునేది హైస్కూల్ స్థాయిలోనేనని ఏలూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు, లింగపాలెం మండల ప్రత్యేక అధికారి జయప్రకాష్ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం, లింగపాలెంలో పదో తరగతి హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ఎటువంటి సౌకర్యాలు లేని సమయంలో హాస్టల్‌లో కష్టపడి చదువుకుని ఎంతో మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని అటువంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి రత్నకుమార్, ఎంపీడీవో కె.వాణి. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బీవీఎస్ఎన్ రాజు, పంచాయతీ రాజ్ ఏఈ జగన్నాథరావు, హాస్టల్ వార్డెన్లు డి.రాధా కృష్ణారావు, ఎం.సునీత, అచ్యుతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ ధర్మాజీగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జె.రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ నందు ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. ఉపాధ్యాయులు ఎల్.ప్రకాష్‌రావు, సూర్యనారాయణ, చైతన్య, సెలీన, మధుబాబు, పద్మజ, శ్రీలత, ఏసయ్య, సునీత, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల జీవనోపాధిని కాపాడండి



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

కుక్కునూరు: స్థానిక లారీలతో మండలంలోని పత్తి, మిరప తదితర రవాణా సర్వీసులు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో లారీ యూనియన్ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ మండలంలో కొంత మంది ఫెర్టిలైజర్స్ యజమానులు బయట లారీలను తీసుకొచ్చి రవాణా చేయిస్తున్నారని, ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. కుక్కునూరు ముంపు ప్రాంతం కావడం పనులు లేక ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ఇప్పుడు ఉన్న ఉపాధి కూడా దెబ్బతింటుంటే దిక్కు తోచని స్థితిలో లారీ డ్రైవర్లు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి మహమ్మద్ వలిపాషా, నిర్మల వెంకటేశ్వర్లు, అంగిరేకుల వెంకటేశ్వరావు, కట్టిబోయిన మల్లేష్, వెంకటేశ్వరరావు, ఓగిరాల నాగరాజు, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

పోలవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముద్ర లోన్లకు సంబంధించి వ్యాపారస్తులు అందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీపేట, ప్రగఢపల్లి గ్రామాల్లోని చిరువ్యాపారుల దుకాణాలను ఆయన సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించి ఈకేవైసీ నిర్వహించారు. ఇందుకు అవసరమైన డాక్యుమెంటేషన్‌ను కూడా సంబంధిత లబ్ధిదారుల నుంచి తీసుకున్నారు. కార్యక్రమాన్ని వినియోగించుకొని, సకాలంలో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బుట్టాయగూడెం: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం 2025 నూతన క్యాలెండర్‌ను ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మొడియం గంగరాజు, పోసి, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో నర్సరీ ఏర్పాటు తగదు



జెడ్పీ హైస్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లితండ్రులు

కొయ్యలగూడెం: గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నప్పటికీ హైస్కూల్ ప్రాంగణంలో నర్సరీ ఏర్పాటు చేయాలనే అధికారుల తీరుకు నిరసనగా రాజవరం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. జెడ్పీ హైస్కూల్ ఎదుట శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేస్తూ విద్యాధికారుల నియంతృత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సరీ ఏర్పాటుపై రెండు సంవత్సరాల క్రితమే అభ్యంతరాలు తెలిపి అక్కడి నుంచి తీయించేశామని మళ్లీ ఇప్పుడు కొందరి లాభం కోసం నర్సరీ ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. నర్సరీ ఏర్పాటు వలన విద్యార్థులకు ఆట స్థలం తగ్గిపోవడం, అపరిచిత వ్యక్తులు నర్సరీ పేరున ప్రాంగణంలోకి రావడం వలన విద్యార్థినులకు ఇబ్బందులు గతంలో ఏర్పడ్డాయన్నారు. హైస్కూల్‌లోని తాగునీటి వనరులు నర్సరీకి కేటాయించడం వలన తమ పిల్లలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అందరూ ఏకమై గ్రామ పెద్దలతో సహా నర్సరీ ఏర్పాటు వ్యతిరేకిస్తుండగా ప్రభుత్వ అధికారుల అత్యుత్సాహం చూస్తుంటే పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఎం.దేవి, పల్లా సత్తిబాబు, ఎస్‌కే నాగూర్ సాహెబ్, షేక్ మస్తాన్, ఎస్‌కే భాష, డి.లక్ష్మీనరసయ్య, ఆర్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

అక్రమాల కట్టడికి తహసీల్దార్‌కు వినతి



ఎంజాయ్‌మెంట్ భూముల్లో చేపట్టిన నిర్మాణాలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో రెవెన్యూ శాఖ కనుసన్నల్లో జరుగుతున్న భూ ఆక్రమణలతో పాటు, అక్రమ పొజిషన్, పట్టాల జారీపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు తహసీల్దార్ జేవీ సుబ్బారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. ఆర్ఎస్ నంబర్ 47లో దొరసానిపాడు గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని సయ్యద్ తాజుద్దీన్, సయ్యద్ సలీమ్, సయ్యద్ మైనుద్దీన్ అనే ముగ్గురు అన్నదమ్ములకు, ఒక్కొక్కరికీ మూడు సెంట్ల చొప్పున రెవెన్యూ అధికారులు ఇటీవల పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. దీనిపై కొందరు గ్రామస్తులు స్పందించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, పక్క గ్రామాల్లో ఇళ్లు, స్థలాలు ఉన్న వారికి కూడా తమ గ్రామంలో స్థలాలు ఇచ్చి, వాటికి రెవెన్యూ అధికారులు పొజిషన్ అండ్ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇది సరికాదని, అటువంటి వాటిని రద్దు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: ఒడిదుడుకులను ఎదుర్కొని పత్తి, మిర్చి పండించిన రైతులకు కనీస ధరలు రాక నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కొనుగోలుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. క్వింటాల్ పత్తికి రూ.10 వేలు, మిర్చికి రూ.25 వేలు కనీస ధరలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పత్తి, మిర్చి వ్యాపారులు ధరలు తగ్గించి రైతులకు తీవ్రమైన నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. గత సంవత్సరం క్వింటాల్ రూ.12 వేలు పలికిన పత్తి ధర ఈ సంవత్సరం పత్తి దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా ధర రూ.5600 నుంచి రూ.6300లకే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఒకవైపు పత్తి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలు, వ్యవసాయ ఉపకరణాల ధరలు, వ్యవసాయ కూలీలకు ధరలు అన్ని పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 2024 ఖరీఫ్ సీజన్‌లో క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించినప్పటికీ అమలు చేయని వ్యాపారులపై చర్యలు తీసుకోవటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్తి కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, బోడిక రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

టి.నరసాపురం: అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి దివ్య క్షేత్ర ప్రాంగణంలో శుక్రవారం 29వ శివరాత్రి కల్యాణ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ సాయిబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ జయబాబు, విద్యుత్ అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా శివరాత్రి మహోత్సవ కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివ భక్తులు పసుమర్తి రాము మాట్లాడుతూ ఈ సంవత్సరం శివరాత్రి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఐదు రోజులు దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం స్థానిక సర్పంచ్ సునంద, తహసీల్దార్ సాయిబాబా, ఎస్సై జయబాబు, ఏఈ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ రఘురాంలను ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ రాజు దూశాలలతో సత్కరించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పర్వతనేని మురళి, శ్రీను రాజు, దేవరపల్లి ముత్తయ్య, అద్దంకి మహేశ్వరరావు, పేరం రాంబాబు, కాశనేని వెంకటరావు, లింగారెడ్డి శ్రీను, పెద్దన్న సత్యనారాయణ, చింతలపూడి నవీన్ వెజ్జు రాజు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.